ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

# సత్యభామ

(పౌరాణిక నవల)

ఎమెస్కో

# సాత్రాజితి

ఆకాశం కుప్పకూలి నేల రాలిందా అన్నట్లు మేఘాలు రహదారుల నిండా అలముకొన్నాయి. శిరోజాలు విరబోసుకున్న ఉగ్రదేవతల్లా దట్టమైన ఆకులతో ఉన్న చెట్లు ప్రళయ ఝంఝామారుతానికి ఊగిపోతున్నాయి. అడవుల్లో జంతు సమూహాలు ఏదో ఉత్పాతం జరిగిందన్న సూచనగా దిక్కులు పిక్కటిల్లేలా రోదిస్తున్నాయి.

భయంకరమైన ఆ దృశ్యాలూ, రహదారులను, అడవులను, వాటి వెనుక ఉన్న పర్వతాలను ప్రకంపింపజేసే ఆ జంతువుల రోదనలు ఎవరినైనా చలింప చేస్తాయి. ఎవరి మానసిక స్థైర్యాన్నైనా దెబ్బతీస్తాయి. ఆ సమయంలో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న రథ చక్రాల ధ్వనులు, గుర్రపు డెక్కల చప్పుడు, ఏనుగు ఘీంకారాలు ఆ రోదనలకు మరణ మృదంగాల్లా మ్రోగి ఒక వికృతలయను అందిస్తున్నా, వారు మాత్రం చలించడం లేదు. ఈ పరిణామాలకు వారు ఆశ్చర్యపోతున్నారు. దట్టమైన మేఘాల్లా వారి మనస్సుల్లో ఆలోచనలు క్రమ్ముకున్నాయి, తమ చుట్టూ ఏదో తెలియని చీకటి ఆవరించుకున్నట్లు కనపడుతున్నది. ఈ ప్రయాణం అంతులేని ప్రయాణమా? తాము ఎక్కడికి వెళుతున్నట్టు?

తుఫానులో జలదాలను మైమరిపించే మెరపుల్లా రథాలపై ప్రయాణిస్తున్న ఆ అందమైన కాంతల్ని చూస్తుంటే ఇంకా చూడబుద్ధి అవుతోంది. వారు సామాన్య కాంతలు కారు... వారెవరంటే... రుక్మిణి, సత్యభామ, జాంబవతి, లక్షణ, కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర. ఒక్కొక్కరూ మహాద్భుత సౌందర్యరాశులే. కృష్ణుడి శృంగార రసాస్వాదనలో మమేకమైన ఎందరో సుందరీమణులు, అసూర్యంపశ్యలు, ప్రముఖ యాదవ వీరుల ముద్దుల భార్యలు సైతం ఆ రథాలపై ప్రయాణం చేస్తున్నారు.

అయితే అంతఃపుర కాంతలు ప్రయాణిస్తున్న ఆ రథాలను తేరిపార చూసే ధైర్యం ఎవరికుంటుంది? ద్వారక నుంచి బయలు దేరిన ఆ రథాలకు నాయకత్వం, రక్షణ భారం వహిస్తున్నది పాండవ మధ్యముడు అర్జునుడని అందరికీ తెలుసు. ఎంతటి తుఫాను వచ్చినా, ఎలాంటి ప్రకృతి వైపరీత్యం సంభవించినా అతడి పేరు స్మరిస్తే చాలు, కెరటాలు వెనక్కి వెళ్లిపోతాయని, ఉరుములు, మెరపులైనా శాంతిస్తాయని వారు విన్నారు. ఏ ప్రకృతి అయితే అర్జున, ఫల్గున, కిరీటి, శ్వేతవాహన బీభత్స, విజయ, సవ్యసాచి, ధనంజయ... అని అర్జునుడి పేర్లు స్మరిస్తే తన భయానక రూపాన్ని ఉపసంహరించుకుంటుందో అదే ప్రకృతి తన ప్రళయ తాండవాన్ని ప్రదర్శించడం వారిని చకితులను చేయడం లేదు.

అశ్వాలు డస్సిపోయాయి. ఏనుగులు ఇంకా మందకొడిగా అడుగులు వేస్తున్నాయి. రథ చక్రాలు తిరిగి తిరిగీ సడలిపోతున్నాయి. రథాలపై సాగుతున్నవారిలో ఒక్కోసారి దుఃఖం పెల్లుబుకుతోంది. మరోసారి క్రుంగిపోయి శాంతిస్తున్నది. తామిక ద్వారక చూడనట్లేనా? ఆ భూతలస్వర్గం ఇక తమకు గోచరించదా? తాము పయనిస్తుంటే సముద్ర జలాలు ద్వారకను మహోగ్రంగా ముంచెత్తడం కళ్ళారా చూసి వారు భయకంపితులయ్యారు. వారిలో ఎందరో భర్తలను పోగొట్టుకున్న యాదవకాంతలు, పిల్లల్ని పోగొట్టుకున్న వృద్ధులు, తండ్రులు లేని పిల్లలు అర్జునుడినే సర్వస్వంగా భావించి ఆయన వెంట పయనించారు.

గత కొద్దిరోజులుగా వారి కళ్ళ ముందు మృత్యువు తాండవిస్తూంది. మహా భారతయుద్ధం జరిగి, ధర్మరాజు పట్టాభిషేకం జరిగి మూడున్నర దశాబ్దాలు దాటిన తర్వాత భయంకరమైన ప్రకృతి వైపరీత్యాలు కలిగాయి. ఉదయం పూట పెద్ద గాలులతో ఇసుక వర్షం కురిసింది. మేఘాలు లేకుండా పిడుగులు పడ్డాయి. ఉల్కలు రాలాయి. మండు వేసవిలో దట్టమైన పొగమంచు ఆవరించింది.

కొద్ది రోజుల క్రితమే కణ్వుడు, నారదుడు, విశ్వామిత్రుడు తమ శిష్యులతో కలిసి శ్రీకృష్ణుడిని చూడాలన్న కోరికతో ద్వారకకు వచ్చారు. వారు రాక ముందు ద్వారక ఒక స్వర్గధామంగా ఉండేది... కాని వారు వెళ్ళిన నాటినుండే అది మృత్యుకుహరంగా మారసాగింది. అంతా ద్వారకావాసుల స్వయంకృతాపరాధం. పరిహాసం కోసం చేసిన ఒక చిన్న పని మొత్తం ద్వారకనే అతలాకుతలం చేసింది.

మునులను ఆట పట్టించేందుకు వృష్ణివంశానికి చెందిన కొందరు యువకులు శ్రీకృష్ణుడి కుమారుల్లో ఒకడైన సాంబుడనే వాడికి స్త్రీ వేషం వేసి 'ఈమెకు సంతానం కలుగుతుందా? చెప్పండి' అని అడిగారు. ఆ మునులకు తమను వేళాకోళం చేస్తున్నారన్న విషయం అర్థమై, ఆగ్రహంతో వారిని శపించారు. 'ఈ సాంబుడు యాదవ కులనాశకమైన ఒక రోకలిని కంటాడు...' అని శపించి శ్రీకృష్ణుడిని కలుసుకోకుండానే వెళ్ళిపోయారు.

మరుసటి రోజే సాంబుడి కడుపులోంచి రోకలి వెలువడింది. అతి భయంకరమైన ఆ రోకలిని చూసి భయపడ్డ యాదవులు వసుదేవుడి సూచనతో దాన్నిపొడిచేసి సముద్రంలో కలిపారు. కాని ద్వారకలో ఉత్పాత సూచనలు ఆగలేదు. రాత్రివేళ చిలుకలు గూబల వలె కూశాయి. పగటి వేళల్లో మేకలు కుక్కల వలె అరిచాయి. బలరాముడు, కృష్ణుడు వంటి కొందరు తప్ప యాదవులందరూ పాపకార్యాలు చేయడం ప్రారంభించారు. వావివరసలు లేకుండా శృంగార క్రీడలు జరిపారు. యాదవస్త్రీలు భర్తలను లెక్కచేయడం మాని విచ్చలవిడిగా తిరగడం సాగించారు. హోమకాలంలో అగ్ని నానా వర్ణాలతో భీకరంగా ప్రకాశించింది. జ్వాలలు పైకి ఎగురుతూ దుర్వాసనతో భీతిని కలిగించాయి. అన్నంలో పురుగులు తిరుగుతూ కనపడ్డాయి.

ఈ ఉత్పాతాలను చూసి ద్వారకావాసులంతా ఒక చోట జాతరను జరుపుకునేందుకు రమ్మని ఆహ్వానించాడు శ్రీ కృష్ణుడు. జాతర జరిగేందుకు ముందు రోజు రాత్రి కలల్లో భయంకరమైన దృశ్యాల్ని చూశారంతా. నల్లటి దేహం గల స్త్రీలు ఇళ్ళలోకి చొరబడి గృహిణులను హింసించారు. రాక్షసులు యాదవుల శస్త్రాస్త్రాలను, జెండాలను, ఆభరణాలను దొంగిలించుకుని పారిపోయారు. శ్రీకృష్ణుడి చక్రం ఉన్నట్లుండి ఆకాశంలోకి ఎగిరిపోయింది. శ్రీకృష్ణుడి దివ్యరథం కూడా అదృశ్యమైంది.

శ్రీకృష్ణుడి ఆదేశానుసారం జాతర కోసం యాదవులంతా సముద్ర తీరానికి బయలు దేరారు. రకరకాల పిండివంటలు చేసుకున్నారు. స్త్రీలు అందంగా అలంకరించుకుని పల్లకీలలో బయలుదేరారు. బలరాముడు జాతరకు రాకుండా తపస్సుకు బయలుదేరాడు.

సముద్రతీరం వద్ద గీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేశారంతా. మత్తుపానీయాలు సేవించి భోజనాలు చేశారు. ఆ తర్వాత ఒకరినొకరు పరిహాసాలు చేసుకోవడం మొదలు పెట్టారు. సాత్యకి, కృతవర్మల మధ్య మహాభారత యుద్ధం గురించి ప్రస్తావన వచ్చింది. కృతవర్మ నిద్రలో ఉన్న వాడిని చంపాడని సాత్యకి తాగిన మత్తులో అవహేళన చేశాడు. 'నీవు మాత్రం సోమదత్తుడి కొడుకు నిస్సహాయస్థితిలో ఉండగా అతని తల నరకలేదా...' అని సాత్యకిని ప్రశ్నించాడు. వారి మధ్య వివాదం పెరిగి పెద్దదైంది. శ్రీకృష్ణుడికి కూడా కోపం వచ్చి కృతవర్మ వైపు ఆగ్రహంగా చూశాడు. ఇదే అదనుగా సాత్యకి, శ్రీకృష్ణుడిని రెచ్చగొట్టేందుకు కృతవర్మను నిందించాడు.

'మీ తమ్ముడు శతధన్వుడు, సత్రాజిత్తును శ్యమంతకమణి కోసం చంపలేదా?' అని అన్నాడు. తన తండ్రి పేరు విన్న సత్యభామ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఏడుస్తూ శ్రీకృష్ణుడి వద్దకు వచ్చింది. సాత్యకి దీనితో వారిద్దరికీ సంతోషం కలిగించేందుకు కృతవర్మను ఇంకా